


ఉబ్బసానికి చేప ప్రసాదంతో ఉపయోగం లేదు

# కెరటం న్యూస్
(సామాన్యుడి ఆయుధం)




చిన్నారుల కళ్ళలో ఆనందమే లక్ష్యం

Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :156 | ఆదివారం 08 జూన్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

# తెలంగాణ కొత్త మంత్రులు వీళ్లే



## నేడే అధికారిక ప్రకటన!

**దాదాపు వీరు ఖరారు అయినట్లు సమాచారం :**


మాల = చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మాదిగ = మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ముదిరాజ్ = మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమైంది. ఆదివారం ఉదయం దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. కేబినెట్‌లో కొత్తగా ముగ్గురికి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్థానిక ఎన్నికల వేళ ఎలాంటి గొడవలకు తావు లేకుండా వ్యూహాత్మకంగా కొత్త వారికి అవకాశం ఇచ్చారు. బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు ఈ విస్తరణలో చోటు కల్పించినట్లు తెలుస్తోంది.

ఇప్పటికే కసరత్తు చేసిన పేర్లను పార్టీ అధిష్టానానికి నివేదించినట్టు తెలుస్తోంది. ఈరోజు రాత్రికి లేదా రేపు ఉదయానికి మంత్రివర్గంలోకి తీసుకునేవారి పేర్లపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఆదివారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహణకు గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రేపు నాలుగైదు ముహూర్తాలు ఖరారు చేసినట్లు సమాచారం. మరోవైపు నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో కచ్చితంగా చోటు ఇవ్వాల్సిందేనని కొందరు నేతలు పట్టుబడుతున్నట్టు సమాచారం.



# ముర్షిదాబాద్ అల్లర్లు..

## తండ్రీకొడుకుల హత్యలో 13 మంది నిందితులు




**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్)**ఈ ఏడాది ఏప్రిల్ నెలలో "వక్ఫ్ చట్టానికి" వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్‌లో తీవ్ర మత ఘర్షణలు జరిగాయి. ఆందోళన నిర్వహించిన ముస్లిం గ్రూపులో కొందరు వ్యక్తులు హిందువుల్ని టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడ్డారు. హిందువుల ఆస్తులపై దాడులు చేశారు. ఈ అల్లర్లపై కలకత్తా హైకోర్టు ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ బృందం కీలక విషయాలను వెలుగులోకి తెచ్చింది. పోలీసులు ఈ అల్లర్లను అడ్డుకోవడానికి ప్రయత్నించలేదని, అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) నేతలు, ముఖ్యంగా టీఎంసీ నాయకుడు మెహబూబ్ ఆలం ఈ అల్లర్లలో ప్రధాన నిందితుడిగా తేల్చింది.

ఈ అల్లర్లలో తండ్రీకొడుకులను హత్య చేసిన కేసులో 13 మందిపై బెంగాల్ పోలీసులు చార్జిసీట్ దాఖలు చేశారు. ముర్షిదాబాద్ జిల్లాలో చెలరేగిన మత హింసలో హరగోబిందో దాస్ (74), అతని కుమారుడు చందన్ దాస్ (40)లను నరికి చంపారు. శుక్రవారం ప్రార్థనల తర్వాత షంషేర్‌గంజ్ ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. జట్బోజా గ్రామంలోని బాధితుల ఇంటి తలుపులు పగలగొట్టి, వీరిని బయటకు లాగి పట్టపగలు నరికి చంపారు.

## "ప్లీజ్ ఎక్కువ మంది పిల్లల్ని కనండి" ప్రజల్ని వేడుకుంటున్న 5 దేశాలు

- పలు దేశాల్లో తగ్గుతున్న జననాల రేటు..
- పిల్లల్ని కనేందుకు ఆసక్తి చూపని ప్రజలు..
- ఈ ఐదు దేశాల్లో జనాభా సంక్షోభం..




## మోడీని ఆహ్వానించడంపై కెనడా ప్రధాని కీలక వ్యాఖ్యలు

- జీ7కి ప్రధాని మోడీని ఆహ్వానించిన కెనడా పీఎం..
- ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, సప్లై చైన్‌కి కేంద్రంగా భారత్..
- అందుకే ఆహ్వానం తప్పనిసరి అని చెప్పిన మార్క్ కార్నీ..




## బనకచర్ల ప్రాజెక్టుపై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

### బనకచర్ల మీద కేంద్రం నిర్ణయం తీసుకోలేదు

- గతవారం బనకచర్లపై ఏపీ ప్రభుత్వం డీపీఆర్ ఇచ్చింది
- కేంద్రం ఏపీ ప్రభుత్వం ఇచ్చిన డీపీఆర్ ను
- ఇంకా పరిశీలించలేదు
- బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ ఏవిధంగా నష్టం జరుగుతుందో
- కేంద్రానికి లేఖ రాయాలని సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సూచన


2 లో



## రాహుల్ గాంధీ "రిగ్గింగ్" కామెంట్స్‌పై ఎన్నికల సంఘం ఆగ్రహం

- రాహుల్ గాంధీ "రిగ్గింగ్" కామెంట్స్‌పై ఈసీ ఆగ్రహం
- ప్రతికూల ఫలితాలు వస్తే పరువుతీసే ప్రయత్నం
- ఇప్పటికే కాంగ్రెస్ అనుమానాలు తీర్చామన్న ఈసీ




## శరీరంపై ఆ టాటూ తొలగించిన సమంత

2 లో

## జీహెచ్ఎంసీ పరిధిలోని బార్లకు భారీగా దరఖాస్తులు

- గ్రేటర్ పరిధిలోని 24 బార్ల టెండర్లకు 3668 అప్లికేషన్లు
- ఈ నెల 13న డ్రా పద్ధతి ద్వారా బార్ హోల్డర్స్ ఎంపిక కొనసాగనుంది

2 లో



## నర్సాపూర్ పట్టణంలో రోడ్డు ప్రమాదం





## శ్రద్ధాంజలి



మనసు నిండా బాధను మోస్తూ, పైకి నవ్వుతూ నటిస్తూ, బ్రతకడం ఎంత కష్టమో మీరు లేని ఈ పది రోజులు ప్రతి క్షణం అనుభవించాము. మీ జ్ఞాపకాలతో జీవితాంతం గడిపేస్తాం.. కష్టాలు ఉన్నప్పుడు తోడుగా ఉండి, తీరా మంచి రోజులు వచ్చేసరికి మీరు వెళ్ళి పోయావు.. మీరు మిగిల్చిన తీపి గుర్తులు నెమరు వేసుకుంటూ బ్రతికేస్తాం.. మీరు నేర్పిన విలువలకు కట్టుబడి ఉంటాం.. మీరు కురిపించే ఆశీస్సులే శ్రీరామ రక్ష! మీ పవిత్రాత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ.. మౌనంగా నివాళులర్పిస్తున్నాం..

కీ॥శే॥ బానోత్ మదన్‌లాల్ గారు
మాజీ ఎమ్మెల్యే, వైరా
జననం: 03-05-1963
మరణం: 27-05-2025

భార్య: బానోత్ మంజుల

కుమారుడు - కోడలు
బానోత్ మృగేందర్ లాల్ IAS
శ్వేత సుమన్ IAS

కుమార్తె - అల్లుడు
మనీషా లక్ష్మి - అశోక్ నాయక్

అన్నయ్యలు - వదినలు
బానోత్ రామకోటి - అనసూర్య
బానోత్ సుందర్‌లాల్ - శైల

తమ్ముళ్ళు - మరదళ్ళు
బానోత్ జవహర్‌లాల్ (లేటు) - మంజుల
బానోత్ మంగీలాల్ - సుజాత
బానోత్ మోతిలాల్ - ప్రమీల
బానోత్ మణిలాల్ - భార్గవి

మనుమళ్ళు, మనుమరాళ్ళు మరియు బంధుమిత్రులు

దశదినకర్మ: రేపు ది.08-06-2025 ఆదివారం ఉదయం గం॥ 10-00లకు ఈర్లపూడి గ్రామం, రఘునాథపాలెం మండలం, ఖమ్మం జిల్లా నందు జరుగును.
గమనిక: ఈ ప్రకటననే కార్డుగా భావించి రాగలరు. సెల్: 9000477567

కెరటం న్యూస్



# ముర్షిదాబాద్ అల్లర్లు..

## తండ్రీకొడుకుల హత్యలో 13 మంది నిందితులు

**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):** ఈ ఏడాది ఏప్రిల్ నెలలో "వక్ఫ్ చట్టానికి" వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్‌లో తీవ్ర మత ఘర్షణలు జరిగాయి. ఆందోళన నిర్వహించిన ముస్లిం గ్రూపులో కొందరు వ్యక్తులు హిందువుల్ని టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడ్డారు. హిందువుల ఆస్తులపై దాడులు చేశారు. ఈ అల్లర్లపై కలకత్తా హైకోర్టు ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ బృందం కీలక విషయాలను వెలుగులోకి తెచ్చింది. పోలీసులు ఈ అల్లర్లను అడ్డుకోవడానికి ప్రయత్నించలేదని, అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) నేతలు, ముఖ్యంగా టీఎంసీ నాయకుడు మెహబూబ్ ఆలం ఈ అల్లర్లలో ప్రధాన నిందితుడిగా తేల్చింది.

ఈ అల్లర్లలో తండ్రీకొడుకులను హత్య చేసిన కేసులో 13 మందిపై బెంగాల్ పోలీసులు చార్జిసీట్ దాఖలు చేశారు. ముర్షిదాబాద్ జిల్లాలో చెలరేగిన మత హింసలో హరగోబిందో దాస్ (74), అతని కుమారుడు చందన్ దాస్ (40)లను నరికి చంపారు. శుక్రవారం ప్రార్థనల తర్వాత షంషేర్‌గంజ్ ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. జట్బోజా గ్రామంలోని బాధితుల ఇంటి తలుపులు పగలగొట్టి, వీరిని బయటకు లాగి పట్టపగలు నరికి చంపారు.

ఈ దాడి స్థానిక తృణమూల్ కాంగ్రెస్ నేత, ధులియాన్ మునిసిపాలిటీ మాజీ చైర్మన్ మెహబూబ్ ఆలంపై హైకోర్టు నిజనిర్ధారణ తేల్చింది. నిందితులపై అల్లర్లకు పాల్పడటం, బలవంతంగా ఇంట్లోకి చొరబడటం, ఐదుగురికి పైగా వ్యక్తుల బృందం హత్య చేయడం, ఆయుధాలు మరియు మందుగుండు సామగ్రిని అక్రమంగా కలిగి ఉండటం వంటి అభియోగాలు మోపబడ్డాయి. ఏప్రిల్ 8 నుండి 12 వరకు జరిగిన అల్లర్లలో ముగ్గురు మరణించారు, అనేక మంది గాయపడ్డారు, వందలాది మంది తమ ఇళ్లను పొరుగున ఉన్న మాల్దా జిల్లాకు పారిపోయారు. హింసకు సంబంధించి 300 మందిని అరెస్ట్ చేశారు. ఈ హింసాకాండపై ముర్షిదాబాద్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో 60కి పైగా ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి.

# రాహుల్ గాంధీ "రిగ్గింగ్" కామెంట్స్‌పై ఎన్నికల సంఘం ఆగ్రహం

### రాహుల్ గాంధీ "రిగ్గింగ్" కామెంట్స్‌పై ఈసీ ఆగ్రహం

### ప్రతికూల ఫలితాలు వస్తే పరువుతీసే ప్రయత్నం

### ఇప్పటికే కాంగ్రెస్ అనుమానాలు తీర్చామన్న ఈసీ

**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):** కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. గతేడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు "రిగ్గింగ్" చేయబడ్డాయని ఆయన వ్యాఖ్యానించడాన్ని ఈసీ తోసిపుచ్చింది. ఓటర్లు మోసపోయారనే ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. "ఓటర్లు ఏదైనా ప్రతికూల తీర్పు ఇచ్చిన తర్వాత, ఎన్నికల సంఘం రాజీపడిందని చెప్పడం ద్వారా దాని పరువు తీయడానికి ప్రయత్నించడం పూర్తిగా అసంబద్ధం" అని పోల్ సంఘం తన బలమైన పదాలతో కూడిన సమాధానంలో పేర్కొంది.

దీనికి ముందు, రాహుల్ గాంధీ ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ఈసీ వ్యవహరించిందని, ఓటర్ల జాబితాలను నకిలీ ఓటర్లతో పెంచారని ఆరోపించారు. ఈ వాదనలపై ఈసీ స్పందిస్తూ.. మొత్తం ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, అన్ని రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు హాజరైనట్లు పేర్కొంది. అసాధారణ ఓటింగ్ గురించి కాంగ్రెస్ అధీకృత ఏజెంట్లు ఎప్పుడూ ఎటువంటి అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు లేవనెత్తలేదని కమిషన్ పేర్కొంది.

ఎన్నికల కమిషనర్లు, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకాన్ని నియంత్రించే చట్టంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక ప్యానెల్ నుంచి తొలగించడం ద్వారా కేంద్రాన్ని అనుకూల ఏర్పడిందని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. అయితే, రాహుల్ గాంధీ ఆరోపణలు ఆధారాలు లేనివని, గతేడాది మహారాష్ట్ర ఎన్నికల్లో ఓడిపోయిన కొద్దిసేపటికే కాంగ్రెస్ లేవనెత్తిన అన్ని ఆరోపణలకు సమాధానం ఇచ్చినట్లు పోల్ ప్యానెల్ చెప్పింది. "ఎన్నికల కమిషన్ డిసెంబర్ 24, 2024న INC కి ఇచ్చిన సమాధానంలో ఈ వాస్తవాలన్నింటినీ బయటపెట్టింది, ఇది ECI వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. ఇలాంటి అంశాలను మళ్లీ మళ్లీ లేవనెత్తుతూ ఈ వాస్తవాలన్నింటినీ పూర్తిగా విస్మరించినట్లు కనిపిస్తోంది..." అని ECI తెలిపింది.

# నర్సాపూర్ పట్టణంలో రోడ్డు ప్రమాదం

## కారు ఢీకొని 9 ఏళ్ల బాలిక మృతి

**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):** కారు ఢీకొని 9 ఏళ్ల బాలిక మృతి చెందిన సంఘటన నర్సాపూర్ పట్టణంలోని తూప్రాన్ రూట్ లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నర్సాపూర్ పట్టణానికి చెందిన అర్జున్ లలితల కూతురు తుప్రాన్ ప్రధాన రహదారి పక్కన నడుస్తున్న క్రమంలో తూప్రాన్ వైపు నుంచి వస్తున్న కారు బాలికను ఢీకొట్టింది. దీంతో సిందే అర్చన( 9) అక్కడిక్కడే మృతి చెందింది. విజయం కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని అర్చనను చూసి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కాగా అర్చనకు ఒక అక్క తో పాటు ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నర్సాపూర్ ఎస్సై లింగం తెలిపారు.

# మోడీని ఆహ్వానించడంపై కెనడా ప్రధాని కీలక వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):** కెనడాలోని ఆల్బెర్టాలో జూన్ 15–17 వరకు జరుగబోతున్న G7 శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని నరేంద్రమోడీని, కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానించారు. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తత నేపథ్యంలో, ప్రధాని నరేంద్రమోడీకి ఆహ్వానం రాకపోవడమో లేక ఆయనే ఈ సమావేశానికి వెళ్లకపోవడమో జరుగుతుందని అందరూ అంచనా వేశారు. అయితే, శుక్రవారం కార్నీ స్వయంగా మోడీకి ఫోన్ చేసి సమావేశాలకు రావాలని కోరారు. ఆయన ఆహ్వానాన్ని మోడీ అంగీకరించారు.

అయితే, మార్క్ కార్నీ మోడీని ఆహ్వానించడంపై కెనడాలోని ఖలిస్తానీవాదులు, ఖలిస్తానీ అనుకూల పార్టీలు మార్క్ కార్నీని విమర్శిస్తున్నాయి. అయితే, ఈ విమర్శలకు ఆయన ధీటుగా బదులిచ్చారు. భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని, భారత్ అనేక కీలకమైన ప్రపంచ సప్లై చైన్‌కి కేంద్రంగా ఉందని ఆయన అన్నారు. 2023లో ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యపై స్పందించిన కార్నీ.. ఈ కేసులో చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతున్నందున తాను వ్యాఖ్యానించడం సముచితం కాదని విలేకరులతో చెప్పారు.

ఇంధన భద్రత, డిజిటల్ భవిష్యత్తు, కీలకమైన ఖనిజాలపై చర్చించడంతో పాటు అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన దేశాల మధ్య భాగస్వామ్యాలను నిర్మించడం వంటి కీలక అంశాలపై G7 శిఖరాగ్ర సమావేశం చర్చించబోతున్నట్లు కెనడా ప్రధాన మంత్రి వెల్లడించారు. ఇతర G7 సభ్య దేశాలతో మాట్లాడిన తర్వాత మోడీకి ఆహ్వానం పంపానని కార్నీ చెప్పారు.

అయితే, మోడీకి ఆహ్వానం పంపించడంపై కెనడా ఎన్డీపీ పార్టీ విమర్శించింది. ఈ నిర్ణయం తమకు చాలా ఇబ్బందికరంగా ఉందని పేర్కొంది. నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వానికి సంబంధం ఉందని అప్పటి ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. కెనడాలోని ఐదుగురు భారత దౌత్యవేత్తలకు ఈ హత్యతో ముడిపెట్టాలని అప్పటి ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ చర్యపై భారత్ సీరియస్‌గా స్పందించింది. భారత్ కూడా అంతే సంఖ్యలో కెనెడియన్ దౌత్యవేత్తల్ని బహిష్కరించింది. ఖలిస్తానీ అనుకూల శక్తులు కెనడా నేల నుండి పనిచేయడానికి ట్రూడో ప్రభుత్వం అనుమతిస్తోందని భారతదేశం ఆరోపించింది

# భారత్‌కు రష్యా Su-57 ఫైటర్ జెట్ "సోర్స్ కోడ్" ఆఫర్

## అంగీకరిస్తే " అత్యాధునిక టెక్నాలజీ" మన సొంతం



**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):** యుద్ధ పరిస్థితులు మారుతున్నాయి. ఇప్పుడు అంతా టెక్నాలజీ పైనే యుద్ధాలు ఆధారపడుతున్నాయి. దీంట్లో భాగంగానే పలు దేశాలు తమ సైన్యంలో ఐదో తరం ఫైటర్ జెట్లు ఉండాలని కోరుకుంటున్నాయి. ప్రస్తుతం 5వ తరం యుద్ధ విమానాలు అమెరికా, రష్యా, చైనాలు మాత్రమే సొంతగా తయారు చేసుకున్నాయి. భారత్ కూడా ఈ ఫైటర్ జెట్ డెవలప్మెంట్ పాజెక్టును ప్రారంభించింది.

ఇదిలా ఉంటే, రష్యా నుంచి భారత్ కు బిగ్ ఆఫర్ లభించింది. రష్యా తన ఆధునాతన ఐదో తరం యుద్ధ విమానం Su–57 సోర్స్ కోడ్‌ను భారత్‌కి ఆఫర్ చేసింది. చైనా, పాకిస్తాన్ నుంచి ముప్పును ఎదుర్కొంటున్న భారత్‌కి రష్యా నుంచి వచ్చిన ఈ ఆఫర్ చాలా ప్రయోజనకరమని చెప్పాలి. Su-57E యొక్క సోర్స్ కోడ్‌కు యాక్సెస్ అనేది భారత్ తన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ అభివృద్ధిలో స్వయంప్రతిపత్తికి కీలకంగా మారే అవకాశం ఉంది. రష్యా యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ చేసిన ఈ ప్రతిపాదన ఇప్పుడు కీలకంగా మారింది. మేకిన్ ఇండియా పోగ్రాం కింద భారత్‌లోనే జెట్స్ తయారీ చేస్తామనే ప్రతిపాదన కూడా చేసినట్లు తెలుస్తోంది.

సోర్స్ కోడ్ చాలా కీలకం:

ఫైటర్ జెట్స్‌తో పాటు ఏదైనా రక్షణ రంగ పరికరానికి, క్షిపణులకు "సోర్స్ కోడ్" అనేది చాలా కీలకం. ఈ సోర్స్ కోడ్ ఫైటర్ జెట్స్‌లకు మెదడు వంటిది. ఆ యుద్ధ విమానం నుంచి పనిచేసే ప్రతీ బాంబు, క్షిపణితో ఈ సోర్స్ కోడ్ లింక్ అయి ఉంటుంది. ఒక ఫైటర్ జెట్ కు అన్ని రకాల ఆయుధాలను బిగించాలంటే సోర్స్ కోడ్ తప్పనిసరిగా తెలిసుండాలి. ఉదాహరణకు భారత్ ఫ్రాన్స్ నుంచి రఫేల్ విమానాలను కొనుగోలు చేసింది. వీటి ద్వారా స్కాల్ప్ క్షిపణులు, హామర్ వంటి బాంబుల్ని ప్రయోగించవచ్చు. మన స్వదేశీ టెక్నాలజీతో తయారైన ఆకాష్ వంటి మిస్సైల్స్‌ని ప్రయోగించాలంటే రఫేల్ సోర్స్ కోడ్ అనేది తెలిసి ఉండాలి. అయితే, ఇటీవల పాకిస్తాన్‌తో సంఘర్షణ సమయంలో భారత్ అడిగినప్పటికీ ఫ్రాన్స్ సోర్స్ కోడ్ ఇవ్వలేదని తెలుస్తోంది. సోర్స్ కోడ్ తెలిసి ఉంటే స్వదేశీ ఆయుధాలను ఫైటర్ జెట్లకు అనుసంధానం చేయడానికి, దాని వ్యవస్థలను ఇష్టానుసారంగా మార్చడానికి అనుమతిస్తుంది.

అమెరికా ఊరుకుంటుందా.?

రష్యా ఆఫర్ నేపథ్యంలో అమెరికా ఊరుకుంటుందా..? అనేది ఇక్కడ సమస్య. ఈ ఏడాది ప్రధాని వాషింగ్టన్ పర్యటనలో ట్రంప్ అమెరికా తయారీ 5వ తరం యుద్ధ విమానం ఎఫ్–35 ఫైటర్ జెట్‌ని ఆఫర్ చేశారు. అయితే, దీన్ని తయారు చేస్తున్న లాక్ హీడ్ మార్టిన్ మాత్రం మేక్ ఇన్ ఇండియా, సాంకేతిక బదిలీపై మాత్రం ఏం చెప్పడం లేదు. ఒకవేళ భారత్ రష్యా నుంచి వీటిని కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుంటే, అమెరికా "కాట్సా" ప్రకారం ఆంక్షలు విధిస్తామని బెదిరించే అవకాశం ఉంది. యూకే, ఆస్ట్రేలియా వంటి మిత్రదేశాలతో కూడా F–35 యొక్క పూర్తి సోర్స్ కోడ్‌ను పంచుకోవడానికి %ఖూ% నిరాకరించింది.

భారత్‌కి ఐదో తరం అత్యవసరం:

భారత్‌కి ప్రస్తుతం ఐదో తరం యుద్ధ విమానాలు అత్యవసరం. ఇప్పటికే చైనా వద్ద J–20 మరియు FC–31 వంటి స్టెల్త్ ఫైటర్స్ ఉన్నాయి. వీటితో పోటీ పడాలంటే భారత్‌కి రష్యా లేదా అమెరికాకు చెందిన ఐదవ తరం ఫైటర్ జెట్స్ కావాలి. మరోవైపు, పాకిస్తాన్‌కి కూడా చైనా తన అధునాతన ఫైటర్ జెట్స్‌ని ఇచ్చేందుకు సిద్ధమైంది.ఈ నేపథ్యంలో సుఖోయ్ అభివృద్ధి చేసిన Su-57E ఫైటర్ జెట్ అమెరికన్ ఎఫ్–35, చైనీస్ జే–20కి సమాధానంగా ఉంటుంది. సూపర్ మ్యాన్యువరబిలిటీ, మాక్ 2 గరిష్ట వేగంతో కూడిన మల్టీరోల్ స్టీల్త్ ఫైటర్ ఇది. ఇది 10 టన్నుల వరకు ఆయుధాలను కలిగి ఉంటుంది, అత్యాధునిక రాడార్–ఎగవేత సాంకేతికతను కలిగి ఉంటుంది. స్టెల్త్‌లో ఇది పాశ్చాత్య జెట్‌ల కంటే వెనుకబడి ఉందని విమర్శలు ఉన్నప్పటికీ, ఇది చురుకుదనం, ఎలక్ట్రానిక్ యుద్ధ సామర్థ్యం, కింజాల్ వంటి హైపర్‌సోనిక్ క్షిపణులను ప్రయోగించడంలో సత్తా చాటుతుంది. మరోవైపు, ఎఫ్–35ని కొనుగోలు చేస్తే అమెరికా సోర్స్ కోడ్‌ని ఇవ్వడానికి నిరాకరించవచ్చు . నేపథ్యంలో రష్యా ఆఫర్ భారత్‌కి కీలకం కానుంది. ఎఫ్–35 మెయింటనెన్స్ ఖర్చు కూడా చాలా అధికం.

# వివాహేతర సంబంధం

## భార్య తల నరికి, తలతో పోలీస్ స్టేషన్‌కు

### భార్య వివాహేతర సంబంధంతో గొడవ



**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):**బెంగళూర్‌లో దారుణం ఘటన జరిగింది. నగరంలోని అనేకల్ ప్రాంతంలో 28 ఏళ్ల వ్యక్తి తన భార్య తల నరికి, తలతో పోలీస్ స్టేషన్ వెళ్లి లొంగిపోయాడు. శంకర్ అనే నిందితుడు 26 ఏళ్ల తన భార్య మానస వివాహేతర సంబంధం పెట్టుకుందనే కారణంగా ఈ భయానక చర్యకు పాల్పడ్డాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్, మానస దంపతులు కొంతకాలం క్రితం హీలలిగే గ్రామంలో అద్దె ఇంటికి మారారు. జూన్ 03వ తేదీ రాత్రి, శంకర్ పనికి బయలుదేరాడు, మరుసటి రోజు ఉదయం వస్తానని చెప్పాడు, అయితే, రాత్రి పని ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చాడు. అయితే, ఆ సమయంలో మానస, వేరే వ్యక్తితో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. మానస ఇంటి నుంచి వెళ్లిపోయింది. తర్వాతి రోజు మానస చాలా సార్లు ఇంటికి తిరిగి వచ్చి శంకర్‌ని వేధించినట్లు చెబుతున్నారు.

హత్యకు ముందు రోజు రాత్రి కూడా ఆమె మళ్లీ ఇంటికి వచ్చి సీన్ క్రియేట్ చేసింది. పదేపదే వేధింపులకు గురైన శకంర్ మానస తల నిరికి, ఆపై ఆమె తలతో సూర్య నగర్ పోలీస్ స్టేషన్ వెళ్లాడు. అక్కడే అతను లొంగిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

# శరీరంపై ఆ టాటూ తొలగించిన సమంత

**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):**ఒకప్పుడు తెలుగులో స్టార్ హీరోయిన్‌గా ఎన్నో సినిమాలు చేసిన సమంత, ప్రస్తుతం నిర్మాతగా కొత్త అవతారంలో కనిపిస్తోంది. ఇటీవల ఒక సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె, ఆ సినిమా అంతగా ఆకట్టుకోకపోయినప్పటికీ, ప్రస్తుతం మరో సినిమా నిర్మాణ పనిలో ఉంది. ఒకపక్క రాజ్ నిడిమోరుతో డేటింగ్ వార్తల్లో నిలుస్తున్న ఆమె, తాజాగా మరో విషయంతో వార్తల్లోకి ఎక్కింది.

అసలు విషయం ఏమిటంటే, గతంలో ఆమె నాగచైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఆ సమయంలో నాగచైతన్యతో కలిసి నటించిన యే మాయ చేసావే సినిమాకు సంబంధించిన టైటిల్‌ను ఆమె మెడ భాగంలో టాటూగా వేయించుకుంది. తాజాగా "నథింగ్ టు హైడ్" అంటూ క్యాప్షన్ పెట్టి ఆమె వీడియో పోస్ట్ చేసింది. ఆ వీడియోలో ఆమె మెడ మీద ఎలాంటి టాటూ కనిపించలేదు. మేకప్‌తో దాన్ని కవర్ చేసిందో లేక పూర్తిగా తొలగించిందో అనే క్లారిటీ లేదు, కానీ ఆ టాటూ కనిపించడం లేదు.

నాగచైతన్యతో సంబంధం ఉన్న మరో టాటూను ఆమె ఇప్పటికే తొలగించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె రాజ్ డీకే దర్శక ద్వయంలో రాజ్‌తో ప్రేమాయణం నడుపుతోందనే ప్రచారం జరుగుతోంది. రాజ్‌కు ఇంకా విడాకులు రానందున, వారు వేచి చూస్తున్నారని, విడాకులు వచ్చిన తర్వాత అధికారికంగా రిలేషన్‌ను అనౌన్స్ చేసి వివాహ బంధంలోకి అడుగుపెట్టే అవకాశం ఉందని అంటున్నారు.

# బనకచర్ల ప్రాజెక్టుపై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

## కేంద్రం ఏ నిర్ణయం తీసుకోలేదు!

### గతవారం బనకచర్లపై ఏపీ ప్రభుత్వం డీపీఆర్ ఇచ్చింది

### కేంద్రం ఏపీ ప్రభుత్వం ఇచ్చిన డీపీఆర్ ను ఇంకా పరిశీలించలేదు

### బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ ఏవిధంగా నష్టం జరుగుతుందో

### కేంద్రానికి లేఖ రాయాలని సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సూచన

**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):** బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల మీద కేంద్రం నిర్ణయం తీసుకోలేదు అని తేల్చి చెప్పారు. గోదావరి జలాల పంపిణీ మేరకు తెలంగాణకు అన్యాయం జరగవద్దు.. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరుతున్నాను.. ఎందుకు బనకచర్ల ప్రాజెక్టును నిలిపి వేయాలనే దానిపై పూర్తి వివరాలతో జల వనరుల శాఖను కలవాలి అని కోరారు. బనకచర్ల ప్రాజెక్టు వలన తెలంగాణకి ఏ విధంగా నష్టం జరుగుతోందో డీటెయిల్డ్ గా లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచనలు చేశారు. అయితే, గత వారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి డీపీఆర్ ఇచ్చిందని అన్నారు. కేంద్రం ఇంకా ఆ రిపోర్ట్ పరిశీలించలేదు.. బనకచర్ల ప్రాజెక్ట్ రిపోర్ట్ చదవలేదు.. అధ్యయనం చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటుంది.. కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోంది అని కిషన్ రెడ్డి తెలిపారు.

రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు ఎలిజిబిలిటీ వచ్చింది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. త్వరలో అధ్యక్షుడి ఎన్నిక ఉంటుంది.. నేను మరోసారి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండను.. సేవ్ తెలంగాణ నినాదంతో బీజేపీ ముందుకు వెళ్తుంది.. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ముందుకెళ్తాం అన్నారు. బీజేపీ నేతగా ఈటల రాజేందర్ ను కాళేశ్వరం కమిషన్ ముందుకు వెళ్లలేదు.. గత ఆర్థిక మంత్రిగా ఈటల విచారణకు వెళ్లారు.. బీజేపీ స్టాండ్ చెప్పాలని కమిషన్ అడగలేదు.. ఆర్థిక మంత్రిగా ఏం జరిగిందో ఈటల కమిషన్ ముందు వివరించారు.. ఇక, తుమ్మల నాగేశ్వర్ రావు ఆల్ పార్టీ మంత్రి.. బీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలలో మంత్రిగా పని చేశారని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# "ప్లీజ్ ఎక్కువ మంది పిల్లల్ని కనండి".. ప్రజల్ని వేడుకుంటున్న 5 దేశాలు..

**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):**ప్రపంచ వ్యాప్తం పలు దేశాలు జనాభా క్షీణతను ఎదుర్కుంటున్నాయి. ప్రతీ ఏడాది ఆ దేశాల్లో జననాల రేటు తగ్గుతోంది. దీంతో ప్రభుత్వమే ప్రజలు పిల్లలు కనేలా ప్రోత్సహించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జననాల రేటు పడిపోవడంతో చాలా దేశాలు ఇప్పుడు వృద్ధ జనాభా సంక్షోభాన్ని ఎదుర్కుంటున్నాయి. తక్కువ సంతానోత్పత్తి రేటు కారణంగా భవిష్యత్తులో మానవ వనరుల కొరత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాయి.

టర్కీ: టర్కీలో జననాల రేటు 2001లో 2.38 ఉంటే, 2025 నాటికి 1.48కి పడిపోయింది. ఈ సంఖ్య ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా కన్నా తక్కువ. ఈ పరిస్థితిపై అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ తన ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ స్థితి "యుద్ధం కన్నా భయంకరమైనది"గా అభివర్ణించారు. 2026 నుంచి కుటుంబ దశాబ్దాన్ని ప్రారంభించాలని ప్రకటించాడు. కొత్త జంటలకు ఆర్థిక ప్రోత్సాహాన్ని ఇవ్వాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వియత్నాం: వియత్నాం గత దశాబ్దాల నాటి "ఇద్దరు పిల్లల" విధానాన్ని రద్దు చేసింది. ఇప్పుడు ప్రజలు ఎంత మంది పిల్లలు కావాలంటే అంతమందిని కొనొచ్చని చెప్పింది. 99 నుండి 2022 వరకు సగటు జనన రేటు 2.1గా ఉంది, కానీ 2024లో అది 1.91కి పడిపోయింది. జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, సింగపూర్ దేశాల్లో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది.

చైనా: చైనా గత కొన్నేళ్లుగా జనాభా సంక్షోభాన్ని అనుభవిస్తోంది. యువ జంటలు పెళ్లిళ్లకు, పిల్లలు కనేందుకు ఇష్టపడటం లేదు. ఫలితంగా డ్రాగన్ దేశంలో వృద్ధ జనాభా పెరుగుతోంది. ఈ శతాబ్దం చివరి నాటికి ఇది 1.4 బిలియన్ల నుండి 800 మిలియన్లకు తగ్గవచ్చునే అంచనా ఉంది. ప్రభుత్వమే ప్రజలకు ఎక్కువ మంది పిల్లల్ని కనేలా ప్రోత్సహిస్తోంది.

న్యూజిలాండ్: 2023లో న్యూజిలాండ్ జనన రేటు రికార్డు స్థాయిలో 1.56కి చేరుకుంది. దేశంలో 15 నుంచి 49 ఏళ్ల మహిళల సంఖ్య పెరిగింది, కానీ పిల్లల సంఖ్య తగ్గింది. 2022లటో ఈ రేటు 1.66గా ఉంది. అయితే, ప్రస్తుత జనాభాను నిర్వహించడానికి అవసరమైన 2.1 శాతం కన్నా తక్కువ.

ఉత్తరకొరియా: ఉత్తర కొరియా కూడా జననాల రేటు 1.78. ఈ రేటు దక్షిణ కొరియా, జపాన్, చైనా కన్నా ఎక్కువ. కానీ అవసరమైన 2.1 శాతం కన్నా తక్కువ. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే కిమ్ రాజ్యంలో కార్మికుల కొరత తీవ్రంగా ఏర్పడే అవకాశం ఉంది.

# జీహెచ్ఎంసీ పరిధిలోని బార్లకు భారీగా దరఖాస్తులు

### గ్రేటర్ పరిధిలోని 24 బార్ల టెండర్లకు 3668 అప్లికేషన్లు

### ఈ నెల 13న డ్రా పద్ధతి ద్వారా బార్ హెూల్డర్స్ ఎంపిక

**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24 బార్లు, మిగిలిన జిల్లాల్లోని నాలుగు బార్లకు సంబంధించిన దరఖాస్తులకు భారీ ఆదరణ లభించింది. మొత్తం 28 బార్ల టెండర్ కోసం 3,668 అప్లికేషన్లు వచ్చాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని 24 బార్లకు 3,520 దరఖాస్తులు రాగా.. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలోని నాలుగు బార్లకు 148 అప్లికేషన్లు వచ్చాయి. అయితే, రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ పరిధిలోని జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఒక్క బార్‌కు 57 దరఖాస్తులు, మహబూబ్‌నగర్‌లోని బార్‌కు 49, నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని బార్‌కు 15 అప్లికేషన్లు వచ్చాయి.అయితే, ఈ మొత్తం అప్లికేషన్ల ద్వారా ఎక్సైజ్ శాఖకు సుమారు రూ.36.68 కోట్ల ఆదాయం వచ్చినట్లు సమాచారం. జీహెచ్ఎంసీ పరిధిలోని 24 బార్లకు వచ్చిన దరఖాస్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ డ్రా ద్వారా బార్ల యజమానులను సెలక్ట్ చేస్తారు. జిల్లాల్లోని బార్లకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఎంపిక చేయనున్నారు. ఈ నెల 13వ తేదీన డ్రా పద్ధతి ద్వారా బార్ హెూల్డర్ ఎంపిక కొనసాగుతుందని రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ వెల్లడించారు. డ్రా పద్ధతిని ఎక్కడెక్కడ అనే విషయాన్ని ఒకటి రెండు రోజుల్లో తెలియజేస్తామని చెప్పుకొచ్చారు.

# మేడిగడ్డ దగ్గర గోదావరిలో ఆరుగురు యువకులు గల్లంతు



**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మేడిగడ్డ దగ్గర గోదావరిలో ఆరుగురు యువకులు గల్లంతు అయ్యారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ల సాయంతో గల్లంతైన యువకుల కోసం గాలిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వేసవి వేళ నదిలో స్నానం చేస్తుండగా ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# గిరిజన హామీల అమలుకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం



**హైదరాబాద్ బ్యూరో,07 జూన్ (కెరటం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎడాదిన్నర కావస్తున్నా చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు ఇచ్చిన 16 రకాల హామీలలో ఒక్క హామీలు కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ గిరిజనులను మోసం చేస్తోందని ఆరోపించారు. తక్షణం గిరిజన హామీలపై మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి అమలకు కార్యాచరణ ప్రకటించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని శనివారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మా నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో నేతలు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శులు భూక్యా వీరభద్రం, గూగులోత్ భీమా సాహెబ్, ఎం.బాలు నాయక్, చందు నాయక్, అశ్వినీ, భూక్యా హరి, ఎర్రా నాయక్, అమర్ సింగ్, బాల్యా నాయక్, గోపి, దీప్లా, రాంకుమార్, మహిపాల్ నాయక్, వెంకట్రామ్ నాయక్ తదితరులతోపాటు అన్ని జిల్లాల నుండి రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గిరిజన హామీలను అమలు చేస్తామని ఆనాడు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో జరిగిన బహిరంగ సభలో ప్రకటించారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ గిరిజనులను మోసం చేస్తోందని విమర్శించారు. గిరిజన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని గిరిజన ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. హామీల అమలు ఆలస్యం కావడం వల్ల గిరిజనులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.గిరిజన సంక్షేమ శాఖ రాజ్యాంగబద్ధ అధికారాలు కలిగిన 5వ షెడ్యూల్ ప్రాంతంతోపాటు గిరిజనులకు అనేక హక్కులు, చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. గిరిజన ఎమ్మెల్యేలలతో కూడిన గిరిజన సలహామండలిని, గిరిజన శాఖామంత్రిని ఇప్పటివరకు నియమించకుండా గిరిజనులను అవమానపరుస్తోందని ఆరోపించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. ముఖ్యమంత్రి వద్దే గిరిజన శాఖ ఉండటం వల్ల గిరిజన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ లో ఎస్టీ కమీషన్ ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామన్నారు, మూడు ఎస్టీ కార్పొరేషన్లు, వాటికి ప్రతియేటా ఒక్కో కార్పోరేషన్ రూ.500కోట్లు,అంబేద్కర్ అభయహస్తం పథకం ద్వారా ప్రతి ఎస్టీ కుటుంబానికి 12 లక్షలు,పోడు భూముల సాగుదారులందరికీ హక్కుపత్రాలు, మైదాన ప్రాంత గిరిజనుల కోసం కొత్తగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్ లలో ఐటిడిఎల ఏర్పాటు. సమ్మక్క సారలమ్మ గిరిజన గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా ప్రతి గూడెం, తండా గ్రామ పంచాయితీలకు ప్రతి యేటా 25 లక్షలు, తండా, గ్రామ పంచాయితీలను రెవెన్యూ హెూదా ఇచ్చి, తండాల అభివృద్ధి బోర్డు,ఇండ్లు లేని ప్రతి ఎస్టీ కుటుంబానికి ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు, బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకున్న ఎస్టీ అసైన్డ్ భూములను తిరిగి లబ్దిదారులకు ఇస్తాం,ప్రైవేట్ విద్యా సంస్థలతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందే ప్రైవేట్ పరిశ్రమల్లో రిజర్వేషన్ కల్పిస్తాం, పదో తరగతి నుండి ఉన్నత విద్య అభ్యసించే గిరిజన విద్యార్థికి లక్ష నుండి 5 లక్షల రూపాయలు వంటి వాగ్దానాల్లో ఒక్క వాగ్దానం కూడా అమలుకు నోచుకోలేదని వాటి అమలుకు తక్షణం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో నేతలు హెచ్చరించారు.



## మీ పిల్లలను పాఠశాలలో చేర్పించండి

### వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయండి

### 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి



**ఖమ్మం టౌన్,07 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం పొ? జయశంకర్ బడిబాట అనే పేరుతో ఎంతో ప్రతిష్టాత్మక చేపట్టిన కార్యక్రమంలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి , ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం చే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (జి.పి.యస్) – కూచవల్లాల్ , ఖమ్మం అర్బన్ , ఖమ్మం జిల్లాలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి హాజరై మాట్లాడారు . నాణ్యమైన విద్యకు , సంపూర్ణ వికాసానికి నిలయాలు మన ప్రభుత్వ విద్యాలయాలు అని 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో ఆడ్మిషన్లు ప్రారంభమైనవి అని ఇంగ్లీష్ మీడియం విద్యాబోధన కూడా ఉంటుందని డివిజన్ లో ఉన్న ప్రజలకు , పిల్లల తల్లిదండ్రులకు తెలియజేశారు . అనుభవజ్ఞులైన క్వాలిఫైడ్ టీచర్లచే విద్యాబోధన , విశాలమైన తరగతి గదులలో విద్యాబోధన , ఆటలు , పాటలు , సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యా బోధన , వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ , ఉదయం రాగిజావతో అల్పాహారం , ఉచిత మధ్యాహ్న భోజన పథకం అమలు , రాష్ట్ర ప్రభుత్వం వారిచే మౌళిక వసతుల కల్పన , ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ , 2 జతల యూనిఫామ్స్ , దాతలచే విద్యార్థులందరికీ నోటుపుస్తకాల పంపిణీ వంటి సదా అవకాశాలు ఉంటాయి కాబట్టి మీ పిల్లలను బడిలో చేర్పించండి వారి ఉజ్వల భవిష్యత్కు బాటలు వేయండి అని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో హెచ్ఎం కట్ట వెంకటేశ్వర్లు , స్కూల్ టీచర్స్ డి పద్మాలత , కే సీత , కే రాంబాబు , బి సుకన్య , అంగన్వాడీ టీచర్స్ విజయ్ లక్ష్మి , సృజన , జానకి , ఏఎన్ఎం నాగమణి , డ్వాక్రా గ్రూప్ లీడర్ ఉమా తదితరులు పాల్గొన్నారు.



## గౌడ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపనను విజయవంతం చేయండి

### మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్



**ఖమ్మం టౌన్,07 జూన్ (కెరటం న్యూస్):** గత 30 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం సోమవారం రోజున శంకుస్థాపన కార్యక్రమంతో ఖమ్మం జిల్లా గౌడ కులస్తుల కల నెరవేరబోతుందని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్ అన్నారు.శనివారం తుమ్మల క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాలసాని మాట్లాడుతూ. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రఘునాథ్ పాలెం సబ్ స్టేషన్ ఎదురుగా గౌడ ఆత్మ గౌరవ సభ నిర్వహిస్తున్నామని ఆ సభకు ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు గౌడ్, గోపా అధ్యక్షులు బండి సాయన్న గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని కావున ఖమ్మం జిల్లాలో ఉన్న గౌడ, గోపా, కల్లుగీత కార్మిక సంఘం, గీత పారిశ్రామిక సహకార సంఘాలు, సభ రాజకీయాలకతీతంగా కొనసాగు తుందని కావున బాంధవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ భవన నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఎనలేనిదని ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఒక్క సంవత్సరంలోనే కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. పొన్నెకల్లు నుంచి రఘునాధపాలెం వరకు ర్యాలీ కొనసాగుతుందని , సభ స్థల ఏర్పాట్లు అన్ని పూర్తి కాబడ్డాయని, కావున గౌడ సోదరులు ర్యాలీలో పాల్గొని మంత్రులకు ఘన స్వాగతం పలకాలన్నారు. గతంలో ప్రభుత్వం దాన్వాయిగూడెంలో ఈత చెట్లు పెంచుకునేందుకు 5 ఎకరాల స్థలం కేటాయించిందని దాని ద్వారా వచ్చే కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘాలకు కేటాయించామన్నారు. తెలంగాణ ప్రభుత్వం గౌడుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, గోపా జిల్లా అధ్యక్షులు డాక్టర్ బొల్లి కొండ శ్రీనివాసరావు గౌడ్, ప్రధాన కార్యదర్శి బొలగాని శ్రీనివాసరావు గౌడ్, మార్కం లింగయ్య గౌడ్ , అంబాల వెంకటేశ్వర్లు గౌడ్ ,మహిళా అధ్యక్షురాలు ఊర్మిళ గౌడ్, గోపా గౌరవ అధ్యక్షులు గుడిద శ్రీనివాసరావు గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం నాయకులు బోడ పట్ల సుదర్శన్ గౌడ్, కోసూరి శీను గౌడ్ గౌడ్, మోకు దెబ్బ జిల్లా అధ్యక్షులు బండి నాగేశ్వరరావు గౌడ్, పట్టణ అధ్యక్షుడు వాసు గౌడ్, సింగం జనార్దన్ గౌడ్, రడం సురేష్ గౌడ్, కప్పల మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమమైనా... సహాయమైనా పొంగులేటి ముందంజ



**ఖమ్మం టౌన్,07 జూన్ (కెరటం న్యూస్):** సంక్షేమమైనా... సహాయమైనా అందించడంలో తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముందంజలో ఉంటారని ఆయన క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని బారుగూడెం, గొల్లగూడెం, ఏదులాపురం, వరంగల్ క్రాస్ రోడ్డు, మద్దులపల్లి, జలగంనగర్, నాయుడుపేట, కేబీఆర్ నగర్, రాజీవ్ గృహకల్ప, రెడ్డిపల్లి, ముత్తగూడెం ప్రాంతాల్లో ఇటీవల మృతి చెందిన 20మంది వ్యక్తుల కుటుంబాలను ఓదార్చి పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున ఒక్కో కుటుంబానికి రూ. 10వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... మంత్రిగా ఒకవైపు ప్రభుత్వం తరుపున సంక్షేమ కార్యక్రమాలను ప్రజల దరిచేర్చుతూనే... ఇంకోవైపు తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లోనూ ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు, బాణోతు కిశోర్, భూక్యా సురేష్ నాయక్, బండి జగదీశ్, అజ్మీరా అశోక్ నాయక్, వెంపటి రవి, తమ్మినేని నవీన్, కందుకూరు వెంకట నారాయణ, యాకుబ్, తిప్పిరెడ్డి వీరా రెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మహేశ్ , బానోతు దివ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బారుగూడెంలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన కార్యక్రమంలో దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎంపీ నామ



**ఖమ్మం బ్యూరో,07 జూన్ (కెరటం న్యూస్):** ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామానికి చెందిన మల్లీడి నిర్మల కుమారుడు సాయి రాహుల్ వివాహం, నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన కొంగ్రు కోమలి కుమార్తె సాయి నవ్యశ్రీ తో శుక్రవారం రాత్రి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు. వధూవరుల కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించిన నామ వారి సోదరులు నామ సీతయ్య, నామ కృష్ణయ్య , సోదరి తులసమ్మ, అడ్వకేట్ పోట్ల మాధవరావు ల తో కలసి వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాద్ రావు, కోలేటి నవీన్, మాలంపాటి మధు, నామ సాయిరాం, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణప్రసాద్, జీఎన్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజును సత్కరించిన ప్రోటు



**హైదరాబాద్ బ్యూరో,07 జూన్ (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ యువ నాయకుడు, ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ప్రోటు ప్రవీణ్ శాలువాతో సత్కరించారు. ఎంపీ రవిచంద్రను శనివారం రాత్రి ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు.

## ఎంపీ వద్దిరాజు మాజీ మంత్రి బొత్సకు పరామర్శ



**ఖమ్మం బ్యూరో,07 జూన్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ నాయకులు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురైన సత్యనారాయణను ఎంపీ రవిచంద్ర తన సన్నిహితులు మరికల్ పోత సుధీర్ కుమార్,చందు జనార్థన్, జెన్నాయికోడే జగన్మోహన్ తదితరులతో పాటు శనివారం రాత్రి హైదరాబాద్ ల్యాంకో హిల్స్ లోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు, త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

## యూట్యూబర్ వద్ద 150 పాకిస్తానీ నెంబర్లు పోలీసు కస్టడీ గడువు పొడిగించిన కోర్టు



**న్యూస్ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్):** పాకిస్తాన్‌కు గూఢచర్యం చేస్తున్న ఆరోపణల్తో అరెస్టయిన యూట్యూబర్ జస్బీర్ సింగ్ పోలీస్ కస్టడీని మరో రెండ్రోజులు పొడిగిస్తున్నట్లు పంజాబ్‌లోని మొహాలీ కోర్టు ప్రకటించింది. ఇలాంటి కేసులోనే అరెస్టయిన జ్యోతి మల్హోత్రతో కూడా జస్బీర్‌కు మంచి రిలేషన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే జస్బీర్ కూడా పలుమార్లు పాకిస్తాన్ వెళ్లొచ్చాడని, అతని వద్ద 150 వరకు పాకిస్తానీల నెంబర్లు ఉన్నాయని పోలీసులు ఆరోపించారు.

దీనిపై విచారణకు వారం రోజుల కస్టడీ కోరగా.. కోర్టు కేవలం మూడ్రోజులే అనుమతిచ్చింది. ఈ గడువు తీరడంతో కస్టడీ పొడిగించాలని పోలీసులు కోరడంతో.. అతన్ని మరో రెండ్రోజుల పోలీసు కస్టడీకి పంపాలని కోర్టు నిర్ణయించింది. 'జాన్ మహల్' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నడిపే జస్బీర్ కూడా జ్యోతి మల్హోత్రాలాగే ఢిల్లీలోని పాక్ ఎంబసీలో పనిచేసిన ఐఎస్ఐ హ్యాండ్లర్ డానిష్ అలియాస్ ఎహసాన్-ఉర్-రెహ్మాన్‌తో టచ్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# గ్రామాలలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు

**రూ.9 కోట్ల 63 లక్షల రూపాయలతో చేగొమ్మ గ్రామంలో అభివృద్ధి పనులు**

**కూసుమంచి మండల పర్యటనలో మంత్రి పొంగులేటి**

**జూనియర్ కళాశాల నిర్మాణ స్థల పరిశీలన**

**పలు రోడ్డు నిర్మాణ పనులకు, పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు**



కూసుమంచి,07 జూన్ (కెరటం న్యూస్): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచి మండలంలో మంగళవారం పర్యటించి సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కుల పంపిణీ, పలు రోడ్డు నిర్మాణ పనులకు, పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసారు. కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో నేలకొండపల్లి, కూసుమంచి మండలానికి చెందిన 348 మంది లబ్ధిదారులకు దాదాపు ఒక కోటి 6 లక్షల రూపాయల విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గట్టుసింగారం గ్రామంలో రూ. 23 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, చేగొమ్మ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ. 13 లక్షల 50 వేలతో నిర్మించనున్న అదనపు తరగతి గది నిర్మాణానికి, గైగొల్లపల్లి గ్రామంలో గైగొల్లపల్లి నుండి బచ్చోడు వరకు రూ. 4 కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, పాలేరు గ్రామంలో సీసీ రోడ్డు శంకుస్థాపన చేసిన అనంతరం, జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో రూ. 13 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించనున్న అదనపు తరగతి గది నిర్మాణానికి, నాయకన్ గూడెం గ్రామంలో రూ. 90 లక్షల అంచనా వ్యయంతో సూర్యాపేట - అశ్వారావుపేట రోడ్డు మరమ్మత్తు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఒకటిన్నర సంవత్సర కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట చిత్తశుద్ధితో అమలు చేస్తుందని అన్నారు. చేగొమ్మ గ్రామంలో మొదటి విడతగా 30 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అనర్హులకు ఎవరికైనా ఇండ్లు పొరపాటున మంజూరు చేస్తే వెంటనే రద్దు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గత పాలకులు అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, ప్రతి నెలా గత పాలకులు చేసిన అప్పులకు రూ. 6 వేల 500 కోట్ల రూపాయల కిస్తీ చెల్లిస్తూ, ప్రజలకు ఇచ్చిన ఒక్కో హామి అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతకుముందు కూసుమంచి మండల కేంద్రంలో పాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిధిల భవనం స్థానంలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని మంత్రి పరిశీలించి పలు సూచనలు అందించారు. చెట్లను తొలగించకుండా జూనియర్ కళాశాల నిర్మాణ పనులు పకడ్బందీగా ప్లాన్ చేయాలని, పిల్లలకు ఓపెన్ గ్రౌండ్ పెట్టాలని అన్నారు.



# 'కల్కి 2'అభిమానులకు శుభవార్త చెప్పిన నిర్మాత..!



మూవీ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్): ప్రస్తుతం ప్రభాస్ లైనప్ ఎంత పెద్దగా ఉందో మనకు తెలిసిందే. ఈ లిస్ట్‌లో 'కల్కి 2 కూడా ఉంది. కాగా ఈ బ్లాక్ బస్టర్ హిట్ మూవీ కోసం కూడా చాలా మంది ఓ రేంజ్ లో ఎగ్జైటెడ్‌గా ఎదురు చూస్తున్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రస్తుతం స్క్రిప్ట్ పనులలో ఉండగా,రీసెంట్‌గా అమితాబ్ బచ్చన్ కూడా 'కౌన్ బనేగా కరోడ్‌పతి' పూర్తి చేసిన తర్వాత, కల్కి 2 షూటింగ్ లో పాల్గొంటానని తెలియజేశారు. ఇక 'కల్కి 2898 AD' చిత్రానికి సీక్వెల్ షూటింగ్ మే మధ్యలో ప్రారంభించనున్నట్టు వార్తలు ప్రచారం కాగా ..

ఈ రూమర్స్ పై లేటెస్ట్‌గా సాలిడ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమా నిర్మాణం పనులు అన్నీ దగ్గరుండి చూసుకుంటున్న స్వప్న దత్, ప్రియాంక దత్‌లు నుంచి క్లారిటీ వచ్చేసింది.. 'కల్కి 2898 ఏడీ'తో పాటే సీక్వెల్‌కు సంబంధించిన కొంత షూట్‌ని పూర్తి చేశాం. పార్ట్2కి సంబంధించి 35 శాతం షూటింగ్ జరిగింది, ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి' అని తెలిపారు. ఇక వీటితో పాటుగా దీపికా పదుకొనే పై వస్తున్న రూమర్స్ ని కూడా కొట్టి పారేశారు. ఆమె పార్ట్ 2 లో ఉన్నారని కన్ఫర్మ్ చేశారు. అంటే మొత్తనికి 'కల్కి 2' పై ఒక క్లారిటీ చాలా మందికి వచ్చినట్లే. ఇక 'కల్కి' మొదటి సినిమాలో సుమతి (దీపికా పదుకొనే) ని అపహరిస్తారు. దీంతో ఆమెను కాపాడటానికి అశ్వత్థామ భైరవ అలియాస్ కర్ణ (ప్రభాస్) బరిలోకి దిగుతారు. తర్వాత ఏంటి అనేది స్టోరీ.

# కొడుకు పెళ్లి హడావుడిలో నూ సినిమా కోసమే నాగ్ తపన!



మూవీ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్): నాగార్జున ఒకపక్క తన కుమారుడు అఖిల్ వివాహంతో బిజీగా ఉన్నప్పటికీ, సెకండ్ గేర్ ఇవ్వకుండా తన వృత్తి ధర్మాన్ని చాటుకున్నాడు. అసలు విషయం ఏమిటంటే, నాగార్జున ప్రస్తుతం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేర అనే సినిమా చేస్తున్నాడు. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో నాగార్జున ముంబై బేస్డ్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారు. ముంబైలో పుట్టి, అడుక్కు తినే స్థాయి నుంచి ఒక పెద్ద మాఫియా డాన్‌గా ఎదిగిన వ్యక్తిగా ధనుష్ కనిపించబోతున్నాడు.

సరిగ్గా నిన్న ఉదయమే అక్కినేని అఖిల్ వివాహం జరిగినప్పటికీ, సినిమాకు ఏమాత్రం బ్రేక్ తీసుకోకుండా నాగార్జున తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్‌ను పూర్తి చేశారు. ఈ మేరకు సినిమా టీమ్ ఒక ఫోటో రిలీజ్ చేసింది. అందులో నాగార్జున, శేఖర్ కమ్ములతో కలిసి డబ్బింగ్ థియేటర్‌లో గమ్మున కూర్చుని కనిపిస్తున్నారు.

కుబేర జూన్ 20వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావడానికి రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే సినిమాకు సంబంధించిన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే ట్రైలర్‌తో సహా ప్రీ-రిలీజ్ ఈవెంట్ నిర్వహించేందుకు ప్లాన్‌లు సిద్ధం చేస్తున్నారు. ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తుంది. ధనుష్, నాగార్జున, రష్మికా, జిమ్ సర్భ్ పాత్రల చుట్టూ కథ నడుస్తుందని తెలుస్తోంది.

# ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ప్రధమ కర్తవ్యం

## రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల

### విజయవంతంగా జరిగిన మెగా మెడికల్ క్యాంపు





**ఖమ్మం బ్యూరో,07 జూన్ (కెరటం న్యూస్):** మనిషి తన జీవితంలో ఆనందంగా జీవితం కొనసాగించడానికి ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ప్రధమ కర్తవ్యంగా ఉండాల్సిన అవసరం వుంది అని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మంచికంటి భవన్ లో సీపీఎం పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన బిపి, షుగర్ మెడికల్ క్యాంపు విజయవంతం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక కాలంలో మానవుడు తన అవసరాల కోసం సంపాదన ధ్యాసలో పడి తన ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యంగా వుండటం వల్ల చిన్న వయసులోనే చాలా పెద్ద అనారోగ్య సమస్యలతో బారిన పడుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. అనారోగ్యం వచ్చిన తర్వాత ఎంత డబ్బులు పెట్టినా ఒకసారి ప్రాణం దక్కదని, చిన్నప్పుడు నుంచి ప్రతి మనిషి వ్యాయామం చేయడంతో పాటు రెగ్యులర్ గా వైద్య పరీక్షలు చేయించుకోవాలి అని సూచించారు. ప్రతి నెల నెలా తప్పకుండా నిర్వహిస్తున్న ఈ మెడికల్ క్యాంపు జిల్లా ప్రజలకు బాగా ఉపయోగకరంగా వుంది అని కొనియాడారు. గత ఎనిమిది సంవత్సరాలుగా బిపి షుగర్ పేషెంట్లకు ఉచిత సేవలు అందించడం గొప్ప విషయం అని తన వంతు సహకారం అందిస్తామని చెప్పారు. రాబోయే కాలంలో ఈ మెడికల్ క్యాంపు సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రముఖ డాక్టర్లు అళనే ప్రవీణ్ కుమార్, యాలమూడి వినిషా, యాలమూడి వినోద్, సి భారవి, కొల్లి అనుదీప్, జి రాజేష్, జెట్ల రంగారావు, పిల్లలమర్రి సుబ్బారావు, పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు వై శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, శివనారయణ, అఫ్జల్, రామారావు, పి వాసు, వాసిరెడ్డి వీరభద్రం, నాగేశ్వరరావు, భద్రం, తదితరులు పాల్గొన్నారు





# అఫీషియల్ అనౌన్స్‌మెంట్ అల్లు అర్జున్-అట్లీ ప్రాజెక్ట్‌లో దీపికా




మూవీ డెస్క్,07 జూన్ (కెరటం న్యూస్): ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబోలో భారీ ఎంటర్‌టైనర్ రూపొందుతోన్న సంగతి తెలిసిందే. అనౌన్స్‌మెంట్ నుంచే సినిమాపై అభిమానులకు ఆకాశాన్నంటేలా అంచనాలు ఏర్పడ్డాయి. సైన్స్ ఫిక్షన్, యాక్షన్-ఫాంటసీ జోనర్‌లో భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాకు హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్ అందించడానికి ప్రముఖ స్టూడియోలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నారని సమాచారం. అయితే ఈ సినిమా షూటింగ్‌కి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను ఒక్కొక్కటిగా ప్రకటిస్తున్నారు మేకర్స్.ఇక ఈ మూవీలో కథానాయికగా ఇప్పటికి చాలా పేర్లు వినబడగా మొత్తనికి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే నటించబోతున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా దీపికా పాత్రను రివీల్ చేస్తూ స్పెషల్ వీడియోను పంచుకుంది.దీన్ని నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్లేలా బాలీవుడ్ గ్లామరస్ క్వీన్ దీపికా పదుకొనె కూడా ఈ టీమ్‌తో జాయిన్ కావటం విశేషం. మొత్తానికి అమ్మడు లిస్ట్ లో మరో పాన్ ఇండియా మూవీ వచ్చి చేరింది.